


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
29-01-2026
పేజీలు: 02

# ఈ ప్రపంచానికి భారత్ ఒక ఆశాకిరణం: ప్రధాని మోదీ

బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి ఆయన ప్రస్తావించారు. ఆ ఒప్పందం శుభసూచకమని చెప్పారు. రీఫార్మ్-పెర్ఫామ్-ట్రాన్స్‌ఫామ్ అంటూ బడ్జెట్ టోన్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం భారతదేశం రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తున్నదని ప్రధాని మోదీ చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని తెలిపారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని, అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోందని అన్నారు. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలని చెప్పారు. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోందని ప్రధాని అన్నారు. ట్రేడ్ డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వాటి నుంచి తయారీదారులు లబ్ధి పొందాలని కోరుతున్నానని, ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతామని, దానిని అందిపుచ్చుకుంటామని, దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తామని, అయితే అది మనుషులను భర్తీ చేయలేదని వ్యాఖ్యానించారు.





## ఫోన్ ట్యాపింగ్ కేసు.. కేసీఆర్‌కు సిట్ నోటీసులు

ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇచ్చే పరంపరను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉన్నది. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుకు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది. ఇప్పుడు ఏకంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇచ్చింది. కేసీఆర్ ప్రస్తుతం ఫామ్‌హౌజ్‌లో ఉండటంతో ఇవాళ (గురువారం) ఉదయం సిట్ అధికారులు ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లి నోటీసులు ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే వారు ఫామ్‌హౌజ్‌కు బదులుగా బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు అందజేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు (శుక్రవారం) విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులలో కోరారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు సిట్ అధికారులు కేసీఆర్‌ను విచారించనున్నారు. విచారణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వయసురీత్యా విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, మీరు కోరిన చోటే విచారిస్తామని కేసీఆర్‌కు తెలిపారు.



## రాహుల్ గాంధీ, ఖర్గేలతో సమావేశమైన శశిథరూర్

కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఆ పార్టీ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీని ప్రశంసిస్తూ శశిథరూర్ పలుమార్లు స్పందించారు. దీంతో, కాంగ్రెస్ తో ఆయన సంబంధాలు మరింత బలహీనపడ్డాయి. ఆయన బీజేపీలో చేరబోతున్నారనే ప్రచారం కూడా ఇటీవలి కాలంలో ఎక్కువైంది. మరోవైపు పార్టీ కీలక సమావేశాలకు కూడా థరూర్ వరుసగా గైర్హాజరు అవుతుండటంతో... ఈ ప్రచారానికి రెక్కలొచ్చినట్టయింది. ఈ క్రమంలో ఈరోజు ఆసక్తకర పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో శశిథరూర్ భేటీ అయ్యారు. పార్లమెంటు ప్రాంగణంలో దాదాపు 30 నిమిషాల పాటు వీరి సమావేశం కొనసాగింది. డ్యామేజ్ కంట్రోల్ లో భాగంగా ఈ సమావేశం జరిగినట్టు తెలుస్తోంది. తనవైపు నుంచి వివరణ ఇచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ తో సమావేశానికి థరూర్ సమయం కోరినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వీరి సమావేశం చోటుచేసుకుంది.

# కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి విజయసాయిరెడ్డి విజ్ఞప్తి





భారత విమానయాన రంగంలో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయడంపై తక్షణమే దృష్టి సారించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. దేశంలో విమాన ప్రయాణాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భద్రతాపరమైన చర్యలు కూడా అదే స్థాయిలో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. విజయసాయి రెడ్డి తన ప్రకటనలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. "భారత్‌లో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఏటా 10 నుంచి 12 శాతం పెరుగుతోంది. 2047 నాటికి దేశవ్యాప్తంగా 400 విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నప్పుడు, ఆ వృద్ధికి తగ్గట్టుగా విమాన ట్రాఫిక్ భద్రతను కూడా మెరుగుపరచాలి" అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనల వల్ల ప్రయాణికుల్లో భద్రతపై విశ్వాసం సన్నగిల్లుతోందని విజయసాయి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)ను ఆధునికీకరించాలని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)లో సిబ్బందిని, సాంకేతికతను బలోపేతం చేయాలని సూచించారు. విమానాల నిర్వహణలో లోపాలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కీలకమైన అంశంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యక్తిగతంగా దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## సెమీస్‌కు జొకో

కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం సుమారు రెండేండ్లుగా వేచిచూస్తున్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు అదృష్టం ప్రత్యర్థికి గాయం రూపంలో కలిసొచ్చింది. ఐదో సీడ్ ఇటలీ కుర్రాడు లోరెంజో ముసెట్టి వరుసగా రెండు సెట్లు గెలిచి సెమీస్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకున్నా దురదృష్టం అతడిని గాయం రూపంలో వెక్కిరించింది. కుడి కాలి పైభాగంలో తీవ్ర నొప్పి కారణంగా నడవలేని స్థితికి వచ్చి మ్యాచ్ నుంచి అర్ధాంతరంగా తప్పుకోవడంతో జొకో సెమీస్‌కు అర్హత సాధించాడు. బుధవారం రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో.. 4-6, 3-6, 3-1తో సెమీస్‌కు చేరాడు. ముసెట్టి విజృంభణతో రెండు సెట్లనూ కోల్పోయిన జొకో మ్యాచ్‌పై ఆశలు వదులుకోలేదు. మూడో సెట్‌లో 3-1తో ఆధిక్యంలో ఉండటంతో మరో రసవత్తర పోరు తప్పదనే అనుకున్నారంతా.




## ఓటీటీలోకి వచ్చేసిన వరుణ్ సందేశ్ 'కానిస్టేబుల్'

యంగ్ హీరో వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో నటించిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ 'కానిస్టేబుల్' ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. గతేడాది అక్టోబరులో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తాజాగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శంకరపల్లి అనే గ్రామం చుట్టూ తిరుగుతుంది. వరుస హత్యలు ఆ ఊరిని వణికిస్తుంటాయి. ఈ క్రమంలోనే అక్కడ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కాశీ (వరుణ్ సందేశ్) మేనకోడలు కూడా దారుణ హత్యకు గురవుతుంది. తన సొంత మనిషిని కోల్పోయిన బాధలో ఉన్న కాశీ, ఆ సీరియల్ కిల్లర్ గుట్టును ఎలా రట్టు చేశాడు? ఆ హంతకుడి వెనుక ఉన్న అసలు రహస్యాలేమిటి? అనే ఉత్కంఠభరిత అంశాలతో ఈ చిత్రం రూపొందింది. ఆర్యన్ సుభాస్ ఎస్కే దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వరుణ్ సందేశ్ సరసన మధులిక వారణాసి కథానాయికగా నటించగా, మురళీధర్ గౌడ్, రవివర్మ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. లవర్ బాయ్ ఇమేజ్ ఉన్న వరుణ్ సందేశ్, ఈ చిత్రంలో ఒక సీరియస్ పోలీస్ పాత్రలో కనిపించడం విశేషం.



## ఢిల్లీలో దారుణం.. గర్భిణీ అని చూడకుండా.. డంబెల్‌తో కొట్టి చంపేశాడు!




ఢిల్లీలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ప్రత్యేక ఆయుధాలు, వ్యూహాల్లో (స్వాట్) శిక్షణ పొందిన ఓ మహిళా కమాండో తన భర్త చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. ఆర్థిక విషయాల్లో తలెత్తిన గొడవలు ముదరడంతో భార్య తలపై డంబెల్‌తో బలంగా కొట్టి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు భర్త. మృతురాలు నాలుగు నెలల గర్భిణీ కావడం తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే... ఢిల్లీ పోలీస్ విభాగంలో 'స్వాట్' కమాండోగా పనిచేస్తున్న 27 ఏళ్ల కాజల్ చౌదరి, రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్న అంకుర్‌ను 2023లో వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నాడు. ఈ నెల 22న భార్యాభర్తల మధ్య డబ్బు విషయంలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో అంకుర్, కాజల్ తలపై డంబెల్‌తో దాడి చేశాడు. తీవ్రమైన గాయాలతో ఆసుపత్రిలో చేరిన కాజల్, చికిత్స పొందుతూ మృతి చెందారు. కాజల్ తన సోదరుడు నిఖిల్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగానే అంకుర్ ఈ దాడికి పాల్పడినట్లు తెలిసింది. అంతేకాకుండా కట్నం కోసం కాజల్ అత్తగారు, ఇద్దరు ఆడపడుచులు నిరంతరం వేధించేవారని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు అంకుర్‌పై హత్య కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.



## రెండు గ్రామాల మధ్య ఘర్షణ

అచ్చంపేట మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో వలపట్ల గ్రామచెరువు నుండి నీటిని బయటికి పంపేందుకు రూ. 1.75 లక్షల కేంద్ర నిధులతో చేపట్టిన పైపులైను అభివృద్ధి పనులను లింగోటం గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువు శనిగకుంట నీటితోపాటు, డ్రైనేజీ, బోరు నీళ్లు తమ పొలాల్లోకి, చెరువులోకి వస్తున్నాయని, కలుషిత నీటితో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని లింగోటం యువకులు ఆరోపించారు. ఈ క్రమంలో గురువారం ఇరు గ్రామాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ తోపులాటలో కౌన్సిలర్ బీసీ మల్ల ఆనంద్ స్వల్పంగా గాయపడ్డారు. అలాగే కౌన్సిలర్ అంతటి శివ, మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త అంతటి మల్లేష్లను తోశారు.


## డాన్స్‌తో ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోన్న పూజా హెగ్డే

బుట్టబొమ్మ పూజా హెగ్డే ఈ ఏడాది మూడు సినిమాలతో మెరిసింది. రెండు చిత్రాల్లో(దేవా, రెట్రో) హీరోయిన్‌గా నటించగా, మరో మూవీలో స్పెషల్ సాంగ్ చేసింది. రజనీకాంత్ `కూలీ`లో ఆమె స్పెషల్ సాంగ్‌లో మెరిసిన విషయం తెలిసిందే. `మోనికా` అంటూ ఉర్రూతలూగించింది. ఆ పాట విపరీతంగా ఆకట్టుకుంది. చాలా రోజులపాటు ఇందులో పూజా స్టెప్పులు, ఆమెతోపాటు సౌబిన్ డాన్స్ వైరల్‌గా మారింది. ఇక ఇప్పుడు మరో పాటతో దుమ్మురేపుతోంది పూజా హెగ్డే. దళపతి విజయ్‌తో కలిసి అదిరిపోయే స్టెప్పులేసింది. తాజాగా ఆమె డాన్స్ క్లిప్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.పూజా హెగ్డే తాజాగా దళపతి విజయ్‌తో కలిసి `జన నాయకుడు` చిత్రంలో నటిస్తోంది. మమితా బైజు మరో హీరోయిన్. హెచ్ వినోద్ దర్శకత్వంలో ఈ చిత్ర రూపొందుతుంది. కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మిస్తోంది. ప్రస్తుతానికి విజయ్ నటిస్తోన్న చివరి చిత్రమిదే. ఆయన రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన నేపథ్యంలో ఈ సినిమా తర్వాత విజయ్ పూర్తిగా రాజకీయాలపై ఫోకస్ పెట్టబోతున్నారు. దీంతో ఈ సినిమా చేస్తున్నారు. దీన్ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూపొందిస్తున్నారు దర్శకుడు వినోద్. ఇందులో విజయ్‌తో రొమాన్స్ చేస్తోంది పూజా.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## అందాలతో కాకరేపుతున్న రకుల్

సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ షో బిగ్‌బాస్ సీజన్ 19లో రకుల్ ప్రీత్ సింగ్ టీం సందడి చేసింది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఫస్ట్ పార్ట్‌లో తనకంటే వయసులో చాలా చిన్నదైన ఆయేషా (రకుల్ ప్రీత్ సింగ్)ను ప్రేమ పెళ్లి చేసుకోవాలి అనుకున్న ఆశిష్ (అజయ్ దేవగణ్) తన మాజీ భార్య (టబు) పర్మిషన్‌తోపాటు ఆమె కుటుంబం అంగీకారాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు. ఆయేషా కుటుంబాన్ని ఆశీష్ ఎలా పెళ్లికి ఒప్పిస్తాడు అనే నేపథ్యంలో సీక్వెల్ సాగనుందని ఇప్పటికే ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. సీక్వెల్‌లో ఆయేషా తండ్రి రోల్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ ఆర్. మాధవన్ నటిస్తున్నాడు.






## వడ్డీ ఆదాయంపై పన్ను రాయితీలు
# పెంచాలని సీనియర్ సిటిజన్ల డిమాండ్

రిటైర్మెంట్ తర్వాత వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను రాయితీలు పెంచాలని సీనియర్ సిటిజన్లు, స్మాల్ సేవర్స్ కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న మినహాయింపులు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా లేవని, వైద్య ఖర్చులు, రోజువారీ అవసరాలకు వడ్డీ ఆదాయం సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 1న రానున్న బడ్జెట్ 2026లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు. సేవింగ్స్ అకౌంట్లపై మినహాయింపును రూ.10 వేల నుంచి రూ.20 వేలకు, సీనియర్ సిటిజన్లకు FD వడ్డీపై మినహాయింపును రూ.50 వేల నుంచి రూ.1 లక్షకు పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు., సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీపై మినహాయింపును 50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని సూచిస్తున్నారు. దీని వల్ల పెద్ద పెట్టుబడిదారులకు లాభం కాదు. రోజువారీ ఖర్చుల కోసం వడ్డీపై ఆధారపడే రిటైర్డ్ వర్గానికి మాత్రమే ఊరట. ఇంకో ముఖ్యమైన వర్గం ఉంది. సీనియర్ సిటిజన్లు కాకపోయినా, చాలా మధ్యతరగతి కుటుంబాలు ఫిక్స్‌డ్ డిపాజిట్లనే భద్రతగా చూస్తాయి. కానీ ఈ వర్గానికి FD వడ్డీపై ఎలాంటి పన్ను మినహాయింపూ లేదు. రిస్క్ తీసుకోలేని స్మాల్ సేవర్స్‌కు కనీస స్థాయి డిడక్షన్ ఇచ్చినా, అది పెద్ద భారం కాకుండా ప్రభుత్వానికి కూడా, ఊరటగా ప్రజలకు కూడా మారుతుందని నిపుణుల అభిప్రాయం. ఇటు కొత్త ట్యాక్స్ విధానం విషయానికి వస్తే, అది సింపుల్‌గా ఉన్నా సీనియర్ సిటిజన్లకు పెద్దగా ఉపయోగపడటం లేదు. ఎక్కువమంది రిటైర్డ్ వ్యక్తులు కష్టంగా ఉండే ట్యాక్స్ ప్లానింగ్ చేయరు. వడ్డీ ఆదాయమే వారి ప్రధాన ఆధారం. అలాంటి వారికి కొత్త విధానంలో కూడా చిన్న మినహాయింపు ఇస్తే, ఆ విధానం మరింత న్యాయంగా మారుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇక బడ్జెట్ 2026 ముందు చర్చలో ఉన్న అసలు ప్రశ్న ఇదే.

## కొలంబియాలో కుప్పకూలిన విమానం, 15మంది మృతి





కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దేశ ఈశాన్య ప్రాంతంలోని నార్టే డి సెంటాండర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ సటెనాకు చెందిన ఒక చిన్న విమానం బుధవారం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు సిబ్బంది, 13 మంది ప్రయాణికులతో సహా మొత్తం 15 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రముఖ రాజకీయ నాయకుడు, మానవ హక్కుల కార్యకర్త డియోజెనెస్ క్వింటెరో కూడా ఉండటంతో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. HK4709 రిజిస్ట్రేషన్ నంబర్ గల ఈ విమానం, స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:42 గంటలకు కుకుటా విమానాశ్రయం నుంచి ఒకాన్యాకు బయలుదేరింది. 40 నిమిషాల ఈ ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో విమానానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు కురాసికా అనే మారుమూల గ్రామీణ ప్రాంతంలో విమానం కూలిపోయినట్లు గుర్తించారు. వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి.విమానం ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన తర్వాత అందులో ఎవరూ ప్రాణాలతో మిగిలిలేరని అధికారులు ధ్రువీకరించినట్లు కొలంబియా రవాణా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ విషాద ఘటనపై కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## తిరుమలలో కొత్త జంట వెడ్డింగ్ ఫొటోషూట్..
# దైవ సన్నిధిలో ఇందేంటని ప్రశ్నిస్తున్న భక్తులు



తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణంలో అపచారం జరిగింది. వేంకటేశ్వర ఆలయానికి వచ్చిన ఓ కొత్త జంట వెడ్డింగ్ ఫొటోషూట్ కలకలం రేపింది. బుధవారం ఉదయం పెళ్లి దుస్తుల్లో ఉన్న జంట గొల్లమండపానికి అతి సమీపంలో ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. ప్రత్యేక లైట్ల వెలుగులో ఈ ఫొటోషూట్ జరగ్గా.. నుదుటిపై ముద్దులు పెట్టుకుంటుండగా వీడియోలు, ఫొటోలు తీశారు. అలాగే గొల్లమండపం నుంచి అఖిలాండం వరకు నడుస్తూ ఫొటోలకు ఫోజులిచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు, భక్తులు మండిపడుతున్నారు. తిరుమలలో ఫొటోషూట్లు, రీల్స్ చేయడం నిషేధం. అయినప్పటికీ కొంతమంది ఆలయ పవిత్రతతను దెబ్బతీస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి చేసిన రీల్స్ కూడా గతంలో దుమారం రేపాయి.




## కర్నూలులో భారీ అగ్నిప్రమాదం

కర్నూలులోని కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిన్న భారీ అగ్నిప్రమాదం జరిగింది. కోటయ్య సిల్వర్ సామాగ్రి తయారు చేసే ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు ఆయిల్ ట్యాంక్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఫ్యాక్టరీలోని పలు వస్తువులతో పాటు ఓ వాహనం మంటల్లో దగ్ధమైంది.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

## ఏటీఎంల నుంచి ఇక రూ.10, రూ.20 నోట్లు కూడా!

డిజిటల్ యుగంలోనూ చిల్లర కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు భారత ప్రభుత్వం ఒక వినూత్న ప్రణాళికను సిద్ధం చేసింది. ఇకపై ఏటీఎంల నుంచి కేవలం పెద్ద నోట్లే కాకుండా, రూ. 10, రూ. 20, రూ. 50 నోట్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ చిన్న కరెన్సీ నోట్లను సులభంగా పొందేలా ఏటీఎంలను రీడిజైన్ చేయనున్నారు. ముంబైలో ఈ ప్రణాళికను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. రైల్వే స్టేషన్లు, బస్ డిపోలు, మార్కెట్లు, ప్రభుత్వ ఆసుపత్రుల వంటి రద్దీ ప్రాంతాల్లో ఈ కొత్త ఏటీఎంలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.




## గుంతకల్ ఎమ్మెల్యే అనుచరుల హల్‌చల్




అనంతపురం జిల్లా గంజాయి మత్తులో రౌడీషీటర్ అజయ్ హల్‌చల్ చేశాడు. గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్కిక్కర్‌తో ఉన్న వాహనంతో నానా హంగామా సృష్టించాడు. గంజాయి మత్తులో ఉన్న అజయ్ యాడి మండల కేంద్రంలో కారును రోడ్డుపై అడ్డంగా పెట్టి, అటువైపు వెళ్తున్న వాహనదారులను బెదిరించాడు. రౌడీ షీటర్ తీరుతో ఇబ్బంది పడిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రౌడీషీటర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన అతను గంజాయి ప్యాకెట్లు బయటపడేసి, కారులో తప్పించుకునేందుకు చూశారు. కానీ పోలీసులు ఛేజ్ చేసి పట్టుకున్నారు. అజయ్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.





## వివాహేతర సంబంధంతో
# భర్తని హతమార్చిన భార్య

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని సీత్యాతండాలో బుధవారం వెలుగు చూసిన ఒక హత్యోదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మేనల్లుడితో ఉన్న వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని, ఏకంగా భర్తనే కిరాతకంగా చంపేసిందో భార్య. సీత్యాతండాకు చెందిన రమావత్ రవి(34)కి, లక్ష్మికి 11 ఏళ్ల క్రితం వివాహమైంది. రవి పీఏసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే రవి అక్క కుమారుడైన గణేశ్‌తో లక్ష్మి అక్రమ సంబంధం పెట్టుకుంది. ఈ విషయంలో దంపతుల మధ్య ఏడాది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి లక్ష్మిని అత్తారింటికి తీసుకొచ్చినా ఆమెలో మార్పు రాలేదు. పైగా తనకు అడ్డుగా ఉన్న భర్తను వదిలించుకోవాలని నిర్ణయించుకుంది.ఈ నెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, హైదరాబాద్‌లో పనిచేస్తున్న మేనల్లుడు గణేశ్‌ను లక్ష్మి ఇంటికి పిలిపించింది. ఆ రాత్రి రవి మద్యం మత్తులో ఉండగా, లక్ష్మి-గణేశ్ కలిసి అతడిపై దాడి చేసి హతమార్చారు. మరుసటి రోజు ఉదయం తలుపులు తీసి చూసిన రవి తల్లిదండ్రులకు కుమారుడు విగతజీవిగా కనిపించగా, కోడలు లక్ష్మి మాత్రం కనిపించలేదు. తనతో పాటు మానసిక దివ్యాంగుడైన చిన్న కుమారుడిని తీసుకుని ఆమె ప్రియుడితో పరారైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు.

## పవన్ రాజకీయాలకు పనికిరాడు
### అంబటి రాంబాబు



జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై YCP మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరాడని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే తిరుమల లడ్డూలో జంతు కొవ్వు కలవలేదనే విష ప్రచారం చేశారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ గుడి మెట్లు కడగడంపై కూడా ఆయన స్పందిస్తూ, చంద్రబాబు చెప్పినదంతా నమ్ముతావా అని ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని కాపాడతానని చెప్పే పవన్ కళ్యాణ్, తిరుమలకు వెళ్లి క్షమాపణ చెప్పాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.



## అజిత్ పవార్‌కు కన్నీటి వీడ్కోలు..
# ముగిసిన అంత్యక్రియలు

బారామతిలో విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఇవాళ ఉదయం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితర రాజకీయ ప్రముఖులు ఈ అంతక్రియల్లో పాల్గొన్నారు. అజిత్ పవార్‌ను కడసారి చూసేందుకు ఆయన వర్గం ఎన్సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున మైదానానికి వచ్చి అధినేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా బుధవారం ఉదయం బారామతి విమానాశ్రయం సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం పాలయ్యారు. విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. దాంతో అజిత్ పవార్‌తోపాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పవార్‌కు భార్య సునేత్ర పవార్, ఇద్దరు కుమారులు పార్థ్, జే ఉన్నారు.